మోసం.. చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

ముండ్లపాడు, లింగగూడెం(పెనుగంచిప్రోలు): ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలివ్వటం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయటం సీఎం చంద్రబాబునాయుడు నైజమని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముండ్లపాడు, లింగగూడెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలను మోసం చేస్తున్న తీరును ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా జగనన్న ప్రభుత్వంలో కరోనా కష్టకాలంలో కూడా ప్రజా సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందాయని గుర్తు చేశారు. ఏడాది తిరగక ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ..

అనంతరం రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో క్యూఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీపీల సంఘ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, సర్పంచ్ బరిగెల మంగమ్మ, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామయ్య, ఉపసర్పంచ్ బొక్కా వెంకటరెడ్డి, లింగ గూడెం, ముండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు బరిగెల నాగరాజు, నరాల మధుసూదన రెడ్డి, పార్టీ జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు చేని రాంబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పూట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు



తక్కెళ్లపాడు గ్రామంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



బూదవాడలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తన్నీరు

మోసాలు, భ్రమలతో కాలం వెళ్లదీత..

నందిగామ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసాలు, భ్రమలతోనే కాలం వెళ్లదీస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, కంచల గ్రామాలలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 13 నెలల కాలంలో ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సమర్థంగా అమలు చేయలేదన్నారు. అంతే కాకుండా గత ప్రభుత్వంలో అర్హత కలిగిన పేదలు కూటమి పాలనలో అనర్హులుగా మిగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, నాయకులు స్టాలిన్, చిలుకూరి బుచ్చిరెడ్డి, ఐలపోగు రామయ్య, గర్మిడి నరసింహారావు, జయరాజు, అప్పారావు, ఏసోబు, కొండయ్య, చలమల శ్రీను, రామిరెడ్డి వెంకటేశ్వరరావు, కోలగట్ల శ్రీను, ముత్తయ్య, బుల్లిబాబు, అమర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

బూదవాడ(జగ్గయ్యపేట): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల మేనిఫెస్టోలోని మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మారుమూల పల్లెలకు సైతం తీసుకెళ్లాలన్నారు. అమరావతి గ్రాఫిక్స్ చూపించటమే సరిపోతుంది తప్ప గ్రామాలలో రూపాయి అభివృద్ధి కూడా జరగలేదని విమర్శించారు. కూటమి మోసాలను ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, గ్రామ కన్వీనర్ పరిటాల పెద్ద సైదులు, సీనియర్ నాయకుడు మట్టా ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, నాయకులు జవ్వాజి నరసింహారావు, గడ్డం బిక్షాలు, కరిశ స్వతంత్రరావు, బాణావత్ సైదా, దేవరపల్లి పావని జ్యోతి, భూక్యా గోపి, దారావత్ శ్యామల, చల్లా సుశీల, రెడ్డినాయకతండ, త్రిపురవరం, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, జిల్లా పార్టీ కార్యదర్శి చింతకుంట్ల వెంకటరెడ్డి, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడ్డీకొట్టు దగ్ధం

మంగొల్లు(వత్సవాయి): ఎస్సీ కాలనీలోని బడ్డీకొట్టు అనుమానాస్పదంగా గురువారం రాత్రి అగ్నికి ఆహుతైంది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కర్లపూడి కుమారి ఎస్సీ కాలనీ వద్ద బడ్డీకొట్టు నడుపుకుంటోంది. గురువారం అర్ధరాత్రి బడ్డీకొట్టులో నుంచి మంటలు రావడంతో అప్రమత్తమై చూడగా.. అప్పటికే కొట్టులోని వస్తువులు అన్నీ కాలిపోయాయి. ప్రమాదవశాత్తూ కాలిందా, లేదా ఎవరన్నా కావాలని నిప్పు పెట్టారా అనేది అనుమానాస్పదంగా ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.35 వేల వరకు నష్టం జరిగిందని బాధితురాలు వాపోయారు.

కుస్తీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థికి అభినందన



నందిగామ రూరల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో నందిగామకు చెందిన విద్యార్థి ఓర్సు వెంకటేశ్వరరావు ప్రతిభ కనబర్చటం అభినందనీయమని మాజీ శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన రావు పేర్కొన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో తన తండ్రి ఏడుకొండలుతో కలిసి శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా జగన్ మోహనరావును కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో 66 కేజీల విభాగంలో రజత పథకం సాధించటం గర్వకారణమన్నారు. వెంకటేశ్వరరావు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను జగన్‌మోహనరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నాయకులు మంచాల చంద్రశేఖర్, చిలుకూరి బుచ్చిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాకతీయ విద్యార్థి

నందిగామ రూరల్: ఎస్ఎఫ్ఐ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాకతీయ పాఠశాల విద్యార్థి ఎంపికై నట్లు విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక పాఠశాల ఆవరణలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి కీర్తన్‌ను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడు నుంచి ఏడో తేదీ వరకు అహ్మదాబాద్ నరసారావుపూర్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. స్విమ్మింగ్ కోచ్ గోపిచంద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



కంచికచర్ల: చిన్ననాటి నుంచే విలువలు నేర్పి.. ఉన్నతంగా తీర్చిదిద్ది.. ఉద్యోగం చేసేందుకు సహకారం అందించిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు దాతృత్వంతో ముందుకు రావడం హర్షణీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సుబ్బారెడ్డి అన్నారు. కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు అసెంబ్లీ నిర్వహించుకునేందుకు ప్యూర్ సేవా స్వచ్ఛంద సంస్థ, డేటా ఎకానమీ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో స్టేజీని నిర్మించారు. దీనిని శుక్రవారం సంస్థ ప్రతినిధులు, డేటా ఎకానమీ సీఈఓ కోపూరి రవిశంకర్, ప్యూర్ చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ కంఠంనేని హేమ చేతుల మీదుగా ప్రారంభించారు. రవిశంకర్ మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో విద్యనభ్యసించానని, పాఠశాలకు ఏదో చేయాలనే తలంపుతో స్టేజీ నిర్మించానన్నారు. అనంతరం దాతలను హెచ్‌ఎం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్యూర్ సేవా సంస్థ డైరెక్టర్లు కోగంటి శాంతి, కొలంబస్ ఆర్గనేజేషన్ సాధినేని లత, ప్యూర్ కోఆర్డినేటర్ కోపూరు ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య

ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

చందర్లపాడు(నందిగామ రూరల్): చందర్లపాడు మండలంలోని విభరింతలపాడు గ్రామానికి చెందిన కొల్లి సాంబయ్య (43) తన పొలంలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. మృతుడు గ్రామంలో టెంట్ హౌస్ నిర్వహణతో పాటు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే విధంగా చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామానికి చెందిన కొత్త తిరుపతిరావు శీతల పానీయంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించాడని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడ తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా వీరి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మన్సూర్ సేవలు మరువలేనివి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



జగ్గయ్యపేట అర్బన్: సీపీఐ సీనియర్ నాయకులు మహ్మద్ మన్సూర్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయం కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహ్మద్ మన్సూర్ స్మారక స్థూపాన్ని రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఆర్‌టీసీ డిపో సెంటర్ నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ.. పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభావేదిక వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, పార్టీ జాతీయ నాయకురాలు అక్కినేని వనజ, మాజీ ఎమ్మెల్సీ జన్ని విల్సన్, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి పరుచూరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

పెనుగంచిప్రోలు: స్థానిక ఎస్ఎస్‌పీఎం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో తెలుగు అధ్యాపకురాలు నల్లూరి పద్మ సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు శుక్రవారం డీవైఈఓ డి. సాంబశివరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదవాలన్నారు. అనంతరం స్టడీ మెటీరియల్ అందించిన అధ్యాపకురాలితో పాటు పాఠశాల స్థల దాత స్వామి గోపాలరావును డీవైఈఓ సత్కరించారు. హెచ్‌ఎం నక్కా బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల మెడలోని బంగారు గొలుసులు చోరీ

నందిగామ టౌన్: చైన్ స్నాచర్‌లు మహిళల మెడలోని బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన మందరపు కుమారి ఆమె కోడలు ద్విచక్ర వాహనంపై నందిగామ వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని పాత బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి పల్సర్ బైకుపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రూ. 3లక్షల విలువ చేసే 32 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని తెంపుకెళ్లారని బాధిత మహిళ తెలిపారు. అదే విధంగా కేవీఆర్ కళాశాల వద్ద నడుచుకుంటూ వెళ్తున్న కంతేటి లక్ష్మి మెడలోని 30 గ్రాముల బంగారాన్ని ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లినట్లు ఆమె వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయానికి కార్యదర్శి లేక ఇబ్బందులు

మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయానికి కార్యదర్శి లేకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సచివాలయాల బదిలీలలో భాగంగా మల్కాపురం సచివాలయంలోని కార్యదర్శి, వీఆర్వో, వెటర్నరీ, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఏఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఏవో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రధానమైన కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ లేకపోవటంతో ప్రజలకు సేవల సక్రమంగా అందడం లేదు. ఆయా పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు కార్యదర్శి లేకపోవటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అంతే కాకుండా శుక్రవారం అన్ని రకాల పింఛన్‌లు కూడా కార్యదర్శి లేకపోవటంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తోనే నిధులు డ్రా చేసి పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా గత మే నెలలో సర్పంచ్ ఆంబోజి జాన్ అనారోగ్యంతో మృతి చెందినప్పటికీ నేటి వరకు ఉప సర్పంచ్‌కు ఇన్‌చార్జ్ విధులు అప్పగించకపోవటంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



మల్కాపురం గ్రామ సచివాలయం

తల్లిపాలు అమృతంతో సమానం

నందిగామ రూరల్: తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. నందిగామ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు విధిగా ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు బిడ్డకు తల్లికి మధ్య బంధం మరింత బలపడుతోందని తెలిపారు. సూపర్‌వైజర్‌లు కరుణ కుమారి, వెంకట్రావమ్మ, తారాభి పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం, ఆయుష్షు

కంచికచర్ల: బిడ్డ భూమిపైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నేనని, వెతికేది కూడా తల్లి పాల కోసమేనని శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచటంలో తల్లిపాలు కీలకపాత్ర పోషిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. మండలంలోని పెండ్యాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ అమ్మపాలు అమృతంతో సమానమని, బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలని, ఇది ప్రకృతి వరం కాబట్టే దీనికి మరేదీ సాటిరాదన్నారు. పాలిచ్చేటప్పుడు తల్లి ఒడిలోని వేడి వల్ల బిడ్డకు చేరి చాలా వ్యాధులు దరిచేరవని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైందని సీడీపీఓ అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ, అంగనవాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి

తల్లిపాలతో ఆరోగ్యం..

వీరులపాడు: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సెక్టార్ అధికారి ప్రభావతి పేర్కొన్నారు. మండలంలోని తాటిగుమ్మి, నందలూరు గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు.

తల్లిపాలు దేవుడిచ్చిన వరం..

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు బిడ్డ పుట్టిన వెంటనే అర గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, తిరుపతమ్మ, బి. కమల పాల్గొన్నారు.

వారి వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు

కొణకంచి క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): కొందరు ప్రభుత్వ ఉద్యోగుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొణకంచి క్రాస్‌రోడ్స్ వద్ద పారామౌంట్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. ప్లాంట్ ప్రతినిధులతో పాటు సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్లాంట్‌లో చేసుకున్న ఘటనలు దురదృష్టకరమన్నారు. ప్రభుత్వంలో అవినీతి అధికారులకు స్థానం లేదని, ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పారామౌంట్ కంపెనీ అధినేత వెనిగళ్ల సురేష్ ఈ ప్రాంతంలో ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా ఉంటున్నారన్నారు. కంపెనీ విస్తరణ పనులు పరిశీలించి పూర్తి మద్దతును తెలిపారు. ఆ తర్వాత జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను కూడా ప్లాంట్‌ను సందర్శించారు.

పాఠశాలలో డీవైఈవో విచారణ


పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల ఆకతాయి ఘటనలకు సంబంధించి శుక్రవారం నందిగామ డివిజన్ డీవైఈఓ డి. సాంబశివరావు పాఠశాలలో విచారణ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నడవడిక పట్ల ఉపాధ్యాయులు పర్యవేక్షణ తప్పక ఉండాలని, తేడా ఉంటే వారి తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎంతో బాధ్యతగా ఉండాలన్నారు. పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యార్థులను పర్యవేక్షించటంతో పాటు చెడు నడత ఉన్నవారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జరిగిన సంఘటనలకు సంబంధించి విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. అలాగే పాఠశాలలో టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను వేదిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు డీవైఈఓ దృష్టికి తీసుకురాగా వెంటనే టీసీలు ఇప్పించాలని ఉపాధ్యాయులు, సిబ్బందిని ఆదేశించారు. ఎంఈఓ రవీంద్ర, హెచ్‌ఎం కే జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డీవైఈఓ సాంబశివరావు, పక్కన ఎంఈఓ రవీంద్ర

టీడీపీ నేతపై కఠిన చర్యలు తీసుకోవాలి

నందిగామ రూరల్: మైలవరం పంచాయతీ కార్మికురాలిపై దాడికి పాల్పడిన టీడీపీ నేత కటారి ఉమామహేశ్వరరావును అరెస్ట్ చేయకపోవటం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. దాడికి పాల్పడిన టీడీపీ నేత ఉమామహేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ అని కూడా చూడకుండా పంచాయతీ కార్మికురాలిపై దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. టీడీపీ నేత కావటంతోనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవటంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సలికేటి నరేష్, దాసవరపు సైదా, పుట్ట మాణిక్యం, ఆకుల బేబి, రూతమ్మ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ రూరల్: మండలంలోని కేతవీరునిపాడు–గుత్తావారిపాలెం ఎత్తిపోతల పథకం మోటార్లను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీ..

నూతనంగా మంజూరైన వితంతు పింఛన్‌లను మండలంలోని పెద్దవరం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, నాయకులు వీరాస్వామి, ఇంటూరి సీతయ్య పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 16వ వార్డులో ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు.



ఎత్తిపోతల పథకం స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

జగ్గయ్యపేట: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలోని ఈశ్వరీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతే కాకుండా మహిళలు కుంకుమ పూజలు చేశారు. కొందరు మహిళలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నందిగామలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న అర్చకుడు



పేటలో పూజలు చేస్తున్న మహిళలు

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచికచర్ల: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఎడ్ల బండిపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కాకాని పవన్‌కుమార్ బాబీ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కంచికచర్లలో పూజలు చేస్తున్న అర్చకుడు

నందిగామలో ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని దేవీ ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని మరిడీ మహాలక్ష్మి అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి కుంకుమార్చన, విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అష్టోత్తర సహస్రనామ పూజలు, శ్రీచక్ర నవవర్ణనార్చన, తదితర పూజలు, అభిషేకాలను అర్చకులు వేదోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పూలు, గాజులు, పసుపు, కుంకుమను అందజేశారు.

నందిగామ రూరల్‌లో..

పల్లగిరి గట్టుపైనున్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు జరిపించారు. అదే విధంగా మాగల్లు గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో రాజరాజేశ్వరీ మాతకు అర్చకులు పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపించారు.

వెల్ఫేర్ బోర్డును వినియోగంలోకి తీసుకురావాలి

నందిగామ టౌన్: కూటమి అధికారంలోకి రాగానే వెల్ఫేర్ బోర్డును వినియోగంలోకి తీసుకువస్తామని, భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందిస్తామని చెప్పిన నేతలు.. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పథకాల ఊసెత్తటం లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లి నరసింహారావు, అప్పారావు పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని మంత్రులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సెప్టెంబర్ 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేశ్వరరావు, కటారపు గోపాల్, షేక్ హుసేన్, సుభానీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు